క్లుప్తంగా

తెలంగాణలో బీజేపీదే అధికారం

మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్వర్



బంట్వారం: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మందుల అన్వర్ ధీమా వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, దళితులకు ఇస్తామన్న మూడెకరాల వ్యవసాయ భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుబంధు పేరుతో ఇన్‌పుట్ సబ్సిడీ తీసేశారని, ఇతర వ్యవసాయ రాయితీలు లేకుండా చేశారని విమర్శించారు. ధరణితో రాష్ట్రమంతా వసూళ్ల దందా నడుస్తుందని మండిపడ్డారు. కేసీఆర్‌ను గద్దె దించే సమయం ఆసన్నమైందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న డీటీ సురేష్

కొడంగల్: తహసీల్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవి వలన కార్యాలయానికి వచ్చే వారితో పాటు, బాటసారుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తహసీల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన కొండ రాములమ్మ అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న బీజేపీ నేత, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి.. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య ఆధ్వర్యంలో బాధితురాలికి రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు.

మండల వ్యవసాయ అధికారిగా తులసీరాం



పూడూరు: పూడూరు మండల వ్యవసాయ అధికారిగా తులసీరాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వహించిన తులసీరాం.. ఇక్కడ బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడారు. మండల రైతు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక పద్ధతిలో సాగు చేయడంపై వారికి అవగాహన కల్పిస్తానని వెల్లడించారు.

సబ్సిడీపై జనుము విత్తనాలు

చేవెళ్ల: వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు 65శాతం సబ్సిడీపై జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో తులసి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలానికి 200ల బస్తాలు జనుము విత్తనాలు వచ్చినట్లు చెప్పారు. ముడిమ్యాల పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఏఈఓల వద్ద రసీదు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. 40కిలో బస్తాకు సబ్సిడీ పోను రూ. 1,225లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20 నుంచి ఆయా రైతు వేదికల వద్ద విత్తనాలు సరఫరా చేయనున్నట్లు ఏవో చెప్పారు.

ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి

పీసీసీ సభ్యుడు సిద్దేశ్వర్

మొయినాబాద్: 111 జీఓను ఎత్తివేసినట్లు ప్రకటించి సీఎం కేసీఆర్ ఎన్నికల డ్రామాకు తెరలేపారని చేవెళ్ల నియోజకవర్గం పీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్దేశ్వర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో 111 జీఓ ఎత్తివేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కానీ ఎన్నికల ముందు జీఓను ఎత్తివేస్తున్నామని చెప్పి సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలోనే జీఓ ఎత్తివేశామని అసెంబ్లీలో ప్రకటించి జీఓ 69 తీసుకొచ్చారని.. కానీ ఆ జీఓ విధి విధానాలేమీ చెప్పలేదన్నారు. ఇప్పుడు మరోసారి జీఓ ఎత్తివేశామని చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇళ్ల నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేఅవుట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వనంత వరకు 111 జీఓ ఉన్నట్లేనని ఆయన పేర్కొన్నారు.

నివాళి

షాబాద్: మండలంలోని మాచన్‌పల్లి తండాకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మణెమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, మాచన్‌పల్లి సర్పంచ్ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆమె భౌతిక కాయం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

ముగ్గురు మారినా.. మోక్షం లేదు

- బిల్లులు ఆలస్యం.. పనుల్లో జాప్యం
- ఆరేళ్లుగా కొనసాగుతున్న కాగ్నానది వంతెన పనులు
- సమీపిస్తున్న వర్షాకాలం



కాగ్నా నదిపై కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు

ధారూరు: ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ముచ్చటగా మూడో కాంట్రాక్టర్ వచ్చినా వంతెన నిర్మాణ పనులకు మోక్షం లభించడం లేదు. బిల్లులు సకాలంలో రాకపోవడమే ఇందుకు కారణం అని ప్రజాప్రతినిధులే చెబుతున్నారంటే పనుల్లో ఎంత జాప్యం జరుగుతుందో అర్థం అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ధారూరు మండలం స్టేషన్ ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో.. దాని స్థానంలో కొత్తగా బ్రిడ్జి నిర్మించడానికి 2017లో రూ.4.65 కోట్లు మంజూరు అయ్యాయి.

నెమ్మదిగా కొనసాగుతున్న పనులు

నిధులు మంజూరైన ఏడాదే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. చేసిన పనులకు బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. వచ్చిన మేరకు బిల్లు తీసుకుని వెళ్లిపోయారు. తర్వాత రెండో కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు. అతనికీ బిల్లు రాకపోవడం, ఇసుక వేసిన వారికి కూడా డబ్బులు ఇవ్వకపోవడంతో వారు.. పని ప్రదేశంలో ఉన్న స్టీల్‌ను తీసుకెళ్లడం, ఆ పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. మొదటి కాంట్రాక్టర్‌కు రూ.92.42 లక్షలు, రెండో కాంట్రాక్టర్‌కు రూ.40.76 లక్షల బిల్లులు చెల్లించారు. బిల్లులు తీసుకున్నాకే వారిద్దరూ పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. గత నెలలో మూడో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అతని వద్ద పని చేస్తున్న సిబ్బందికి డబ్బులు చెల్లించకపోవడంతో పనులు మందగించాయి. ఈ వర్షాకాలంలోనైనా పనులు పూర్తి చేయిస్తారా? లేక మళ్లీ నెలల తరబడి ఈ దారిలో రాకపోకలు నిలిపి వేస్తారా అని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లో జాప్యం జరగదు

ఇంత వరకు ఇద్దరు కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించాం. కొత్తగా గత నెలలో మూడో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లు పే చేయాలంటే బిల్లు పెట్టే పొజిషన్‌కు పనులు రాలేదు. స్టీలు, సిమెంట్ తీసుకొస్తే బిల్లు రాదు. వాటితో పనులు చేసి వాటర్ క్యూరింగ్ అయ్యాకే బిల్లు చెల్లిస్తాం. కనీసం రూ.20 నుంచి రూ.30 లక్షల పనులు చేస్తేనే బిల్లు ఇచ్చేందుకు అవకాశం. పనుల్లో జాప్యం జరగకుండా చూస్తున్నాం.

–లాల్‌సింగ్, ఆర్ అండ్ బీ ఈఈ

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 65శాతం సబ్సిడీపై జీలుగ, జనుము, పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. 30 కిలోల జీలుగ బస్త రూ.825, 40కిలోల జనుము బస్త రూ.1,230కి రైతులకు ప్రభుత్వం సరఫరా చేస్తుందని చెప్పారు. పచ్చిరొట్ట సాగు చేయడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, పండించిన పంటలకు అన్ని రకాల పోషకాలను అందిస్తుందన్నారు. కావున రైతులు రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తుందని తెలిపారు. గతంలో రైతులు విత్తనాల కోసం బారులు తీరాల్సి వచ్చేదని, కానీ నేడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు

పూడూరు: సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తీర్ణత అధికారి రాంబాబు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టదారు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో మన్నేగుడ ఆగ్రోస్, చన్గోముల్ ఆగ్రోస్ కేంద్రాలకు రావాలని చెప్పారు. 30 కిలోల జీలుగ బస్తాకు రూ.843, 40 కిలోల జనుము బస్తాకు రూ.1,225 చెల్లించాలని చెప్పారు.

కొత్తగడికి విద్యుత్ సబ్ స్టేషన్

త్వరలో పనులు ప్రారంభం

- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: లో ఓల్టేజి సమస్య తీర్చేందుకు కొత్తగడికి నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. శుక్రవారం కొత్తగడిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డితో కలిసి మీతోనేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతానికి కొత్తగా సబ్ స్టేషన్ మంజూరు చేశామని, త్వరలో నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి, పనులు ప్రారంభించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఇక్కడి రైతులకు ఇప్పటివరకు రైతుబంధు పథకం ద్వారా నాలుగు కోట్లయాభై లక్షలు పెట్టుబడి సాయం, 11మంది రైతులకు రైతుబీమా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

కల్లాల్లోనే ధాన్యం రాశులు

- వెంటాడుతున్న వర్ష సూచనలు
- కలవరపడుతున్న కర్షకులు
- సేకరణ ప్రక్రియ మొదలు పెట్టని ప్రభుత్వం
- కల్లాలను సందర్శించిన కాంగ్రెస్ శ్రేణులు



కల్లంలో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కుల్కచర్ల: వరి కోతలు ముగించుకొని, కల్లాల్లో ధాన్యం రాశులతో రైతులు సిద్ధంగా ఉన్నా.. అధికారులు మాత్రం ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించకపోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ముజాహిద్‌పూర్ గ్రామంలో కల్లాల్లోని ధాన్యం కుప్పలను పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ కల్లాల వద్ద ధాన్యం కుప్పలు పోసుకొని, ప్రభుత్వం ఎప్పుడు కొంటుందా అని ఎదురు చూస్తున్నారని, ఇదే సమయంలో వర్షం ఎప్పుడు పడుతుందోనన్న కలవరపాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గోనె సంచులు ఇవ్వకుండా, ధాన్యాన్ని తీసుకురమ్మని చెప్తున్న అధికారులు.. ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించకపోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. మండల పరిధిలో 44 గ్రామపంచాయతీలు ఉండగా.. కుల్కచర్ల గ్రామంలో మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, మరెక్కడా సేకరణ ప్రక్రియ చేపట్టడం లేదని, ప్రారంభోత్సవాలు చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అన్ని గ్రామాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణయ్య, సోమలింగం, భాస్కర్, షర్ఫుద్దీన్, భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వీఓఏల జిల్లా కార్యదర్శి ప్రభు, మండల కార్యదర్శి పుల్లయ్య, సుధాకర్, శంకర్, రాంరెడ్డి, లాలన్న, వెంకటయ్య, ఇబ్రహీం, రేఖ, పుష్ప, సునిత, సుజాత, లక్ష్మి, మమత వివిధ మండలాల వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు

కుల్కచర్ల: పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అల్లాపూర్ సర్పంచ్ శివిబాయి అన్నారు. శుక్రవారం అల్లాపూర్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం చాకల్‌పల్లి తండాలో మురుగుకాల్వలను పరిశీలించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, ఇంటి ముందుకు వచ్చే ట్రాక్టర్లో వేయాలని గ్రామస్తులకు సూచించారు. పిచ్చి మొక్కలు పెరగకుండా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు వారి ఇంటి వద్ద మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి బేగం పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి



విత్తనాలు పంపిణీ చేస్తున్న నేతలు

దోమ: సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు వస్తాయని దోమ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల రైతు బంధు కోఆర్డినేటర్ లక్ష్మయ్యలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రాయితీపై జనుము, జీనుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగానే అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వెల్లడించారు. మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధం

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌లో పంపిణీకి ఎరువులు సిద్ధంగా ఉన్నాయని సీఈఓ బ్రహ్మం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులు తీసుకు వెళ్లాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నిర్ణీత ధర బస్తాకు రూ.1,350 ఉందన్నారు. ప్రస్తుతానికి 25 టన్నుల డీఏపీ అందుబాటులో ఉందని, అవసరాన్ని బట్టి మళ్లీ తెప్పిస్తామని ప్రకటించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చేవెళ్ల: అనారోగ్య కారణాల వలన ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపల్లికి చెందిన జంగమ్మ(50) అనారోగ్యంతో బాధపడుతోంది. గతంలో భర్త చనిపోవడంతో కొడుకు నర్సింహులు వద్ద ఉంటోంది. సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు రాలేదు. దీంతో ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారుజామున బావిలో మృతదేహం లభించింది. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌ఏల పర్మినెంట్ సంబురం



పెద్దేముల్: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కొడంగల్‌లో..

పెద్దేముల్: వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో వీఆర్‌ఏలు హర్ష వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్ కార్యాలయం ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణసంచాలు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, ప్రధానకార్యదర్శి సమీర్, కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కో–కన్వీనర్ జనార్దన్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు అమిరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: వీఆర్‌ఏల రెగ్యులర్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలం వ్యక్తం చేయడంతో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వీఆర్‌ఏలు మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెల వేతనాలు, ఇతర సౌకర్యాలు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించనట్లు తెలిపారు.

రుణపడి ఉంటాం



అనంతగిరి: సమస్యల పరిష్కారం కోసం రెండు సంవత్సరాలుగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని తెలంగాణ వీఆర్‌ఏ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ సత్యానారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మా సమస్యలు పరిష్కరిస్తామని కేబినెట్‌లో తీర్మానం చేసినందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలోపు వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తూ.. ప్రభుత్వం జీవో జారీ చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.

జీవో రద్దుతో మాట నిలబెట్టుకున్న కేసీఆర్

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్: జీఓ 111ను ఎత్తివేసి సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. 111 జీఓ ఎత్తివేయడం హర్షణీయమన్నారు. హైదరాబాద్‌కు తాగునీరు అందించడం కోసం నిర్మించిన గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో 111 జీఓ తీసుకొచ్చారని తెలిపారు. ఈ జీవో వలన 84 గ్రామాల్లో వ్యవసాయం చేయాలన్నా, ఇళ్లు నిర్మించుకోవాలన్నా ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. జీఓ ఎత్తివేయాలని అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. ప్రజల బాధలు తెలిసిన కేసీఆర్ జీఓను ఎత్తివేయడం జరిగిందన్నారు. జీఓ ఎత్తివేతతో ఈ ప్రాంతం మహానగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు. నియోజకవర్గం ప్రజల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు మోహన్‌గౌడ్, డప్పు ఆనంద్, నాయకులు నీలకంఠం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

షాద్‌నగర్: షాద్‌నగర్‌ను ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతానని, వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 2, 16, 18 వార్డులో ఎమ్మెల్యే బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే బస్తీబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వార్డులను విడతల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, విశ్వం, కమిషనర్ వెంకన్న, నాయకులు కిషోర్, శ్రీశైలం, వెంకట్‌రావు, ప్రకాష్‌గౌడ్, శంకర్, నర్సింహ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని కాలేజీ రోడ్డుకు చెందిన విద్యాసాగర్‌కు రూ. 1.50లక్షలు, ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డికి రూ. 20వేలు మంజూరు కాగా ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీలకు న్యాయం

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మైనార్టీలకు తగిన న్యాయం జరుగుతుందని, పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో మైనార్టీ నాయకులు, మసీదు కమిటీలు సంయుక్తంగా నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు మంచి అవకాశాలు ఉండేవని, ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చి, వారికి అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించిందని చెప్పారు. మైనార్టీలంతా ఏకమై పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సత్యనారాయణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్సారీ, జిల్లా నాయకులు ఎర్రవల్లి జాఫర్, సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, రత్నారెడ్డి, రఘుపతి రెడ్డి, అనంతయ్య, మతీన్, రహీం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్